

# మోసగాండ్ర కథలు



పండిత పురాణం సూర్యనారాయణ తీర్థులు గారు

౧

శ్రీమంతమైన మాళవదేశములో ఉజ్జయని అను గొప్పపట్టన మొకటికలదు. ఆపట్టణమున కుత్తరముగా దట్టమయిన-ఒకవనము ఉండెడిది. ఒకప్పుడా అడవిలో నాలుగువైపులనుండియు వచ్చి రెండువేల ఐదు వందలమంది మోసగాండ్రు బసచేసినారు. ఆ ధూర్తులు మహామాయా ధురంధరులు. మిక్కిలి నిర్దయులు. వారిని బోలిన విశ్వాసఘాతుకులు మఱియెచ్చటను ఉండరనియే చెప్పుకొనుచుండెడువారు. ఆ మహానుభావులు చేయఁజాలని దురాగ్రకార్యములు భూలోకములోనే కాదు; ఏలోకములోను ఉండవందురు. మాటలలో బృహస్పతి వంటివారినిగూడ నిరక్షరకుక్షు లనిపించఁదగినంతటి నేర్పు గలవారు. పలురకముల ధూపములు, అంజనములు,చూర్ణములు మొదలయినవానిలో సిద్ధహస్తులు. స్తంభిని, అవస్వాపిని మొదలయినవిద్యల నెఱిఁగిన పండిత ప్రకాండములు. గొంతు, రంగు, వేషము మార్చి ప్రతివారిని మోసపుచ్చఁజాలినవారు. ఈ-అందఱకును అయిదుగురుముఖ్యాధికారులు గలరు. 1. మూలదేవుఁడు, 2. కండరీకుఁడు, 3. ఏలాషాఢుఁడు, 4. శంసుఁడు, 5. ఖండవణ— అని వారి పేళ్లు.

ఈ అయిదుగురికిని అయిదేసివందలమందిచొప్పున ఒక్కొక్క-గుంపు కలదు. అయిదవగుంపులో అందఱును స్త్రీలే. ఆగుంపున కధికారిణి ఖండవణ అను స్త్రీ. ఈ అయిదుగురు ధూర్తనాయకులును, మోసములో చాల ఆరితేఱినవారు. కాని, వారిలో మూలదేవుఁ డనువాఁడు నిరుపమానుఁడు. వానితో సాటిచేయఁదగిన మోసగాఁడింతవఱకును బుట్టియుండనేలేదఁట!

వీరందఱును దిరుగుచుఁ దిరుగుచు, ఎక్కడనుండియోవచ్చి ఉజ్జయనీపట్టనమునకు సమీపముగాఉన్న వనములో బసచేసియుండఁగా, అమాంతముగా ఏనుఁగుతొండాలవంటి వర్షధారలు ప్రారంభించినవి. చూచుచుండఁగానే నూతులు, బావులు, చెఱువులు, నదులు మొదలయిన జలాశయములన్నియు నిండిపోయినవి. నదీప్రవాహము పొంగి పొరలుచు చుట్టుపట్లనున్న గ్రామాదులను ముంచివేయుచున్నది. ఎక్కడచూచినను నీరేతప్ప, మఱేమియు నగపడుటయేలేదు. వేయేల? ఏకార్ణవమయిపోయినట్టు కనుపట్టినది. సుగమమార్గము లన్నియు దుర్గమము లయిపోయినవి. మనుష్యు లిండ్లనుండి బయటికివచ్చుట కష్టతరమయిపోయినది. ఈయింటిమీఁదికాకి, ఆయింటిమీఁదను వ్రాలకుండ నున్న దన్నట్లున్నది సమయము. ఇట్టి ఘోరవర్షము కారణముగా ఆధూర్తులందఱును విచారగ్రస్తచిత్తులయి "మనుజులుకూడ బయటికి రాఁజాలనంతటి యిట్టి ఘోరవర్షసమయమున, మన మెవ్వరిని మోసపుచ్చి ఉదరపూజ చేసికొఁ గలుగుదుము? ఇట్టికష్టసమయమున మన కెవ్వ రిచ్చటికిఁ దెచ్చి భోజనముపెట్టి పుణ్యము కట్టుకొందురు? ఆఁకలిబాధ సహింపఁజాలక ప్రాణములు కంఠగతము లగుచున్న వే!" అని దుఃఖింప మొదలిడినారు. అప్పుడు ధూర్తశిరోమణి యగు మూలదేవుఁ డనువాఁ డిట్లన్నాఁడు.—

మూల:—సోదర- సోదరీమణులారా! ఇపుడు మనభోజనవిషయమున నే నొక-ఉపాయ మాలోచించియున్నాను, వినుండు. ఇప్పుడు మన మైదుగురమును చూచినదిగాని, విన్నదిగాని, అనుభవించినదిగాని, ఒక్కొక్కకథ చెప్పుదము. ఆకథ విని మనలో ఎవఁడు "ఈ సంగతి యె ట్లంగీకరింపఁదగియుండును?" అని సందేహించునో, వాఁ డద్దానిని అసత్యమని బుజువు చేయవలయును. అతఁడే మనకందఱకును భోజనమునకగు కర్చియ్యవలసియుండును. ఆకథలను మనలో ఎవరయినను భారతము, రామాయణము, భాగవతములగు పురాణగ్రంథము

లనుండి ప్రమాణముచూపి సత్యముఅని సిద్ధాంతముచేయు నో, ఆశ్చర్యమును కలిగించుమాటలచేతను మనకు మనో రంజన చేయునో, ఆతఁడందఱిలోను ఎక్కువబుద్ధిగలవాఁ డుగా ఆలోచింపఁబడును. మఱియు, ఆతఁడు భోజన మున కగు కర్చియ్యనక్కఱలేదు.

కండరీకుఁడు:—అయ్యా! తమరు చాల మంచి ఉపాయ మాలోచించినారు. ఇక్కడ చేరిన- అందఱి లోను తమరే పెద్దలు కనుకను తమరు చూచినదిగాని, విన్నదిగాని, అనుభవించినదిగాని యేదయినను ఒకకథ సెలవియ్యవలెను.

మూల:—అటులేని చెప్పుచున్నాను, సావధాన ముగా వినుండు. నేను మంచివయస్సులో ఉన్నప్పుడు నిరంతరము మనసున కిష్టమయిన వస్తువులు సంపాదించు ప్రయత్నములో ఉండెడివాడను. ఇట్లుండఁగా—ఒక నాఁడు ఘోరముగ వాన కురియుచున్నది. నేను నాయ జమానుని సంతోషపెట్టఁదలఁచుకొని నెత్తిమీఁదను ఒక మూట పెట్టుకొన్నాను. అది, నేను వానలో తడియ కుండ ఉండుటకై ఒకచేత గొడుగు పట్టుకొన్నాను. రెండవచేత జారీచెంబు మొదలయిన కావలసినవస్తువులు పట్టుకొని యింటినుండి బయటికి బయలుదేరినాను. కొంచెముదూరము నడచి దారిలో చూచునప్పటికి— అయ్యా! ఎక్కడనుండియో కాని నడకొండవంటి మదిం చినయేనుఁగొకటి నావైపు పరుగెత్తుకొని వచ్చుచున్నది. సరి; ఇఁక నేమున్నది? దానిని జూడఁగనే నామీఁది ప్రాణాలు మీఁదనే యెగిరిపోయినవి. అపుడు నాకు కలిగినభయ మింతింత యని చెప్పఁజాలను. ఒడలంత యు గడగడవడఁక మొదలిడినది. "దైవమా! ఇపుడేమి చేయుదును? నాయీశరీరము నెచ్చట దాఁచుకొనఁగలను? ఎవరిని శరణు పొందుదును?" అని యేమేమో ఆలోచిం చుకొనుచు ఉంటిని. అంతలో ఏనుఁగు జొత్తిగా దగ్గ ఱకు వచ్చినది. అపుడు మృత్యుభయమువలన నా కేమి యుఁ దోఁచినది గాదు. నాచేతనున్న జారీచెంబు క్రింద ను ఉంచి దానిలోఁ దూఱినాను. "ఇంక భయములేదు; బ్రతికితినిరా దైవమా! అనుకొన్నాను." కాని, ఏనుఁ గుమాత్రము బుద్ధిలో నాకంటె తక్కువది అనుకొన్నా రేమో? కాదుకాదు. నే నట్లు జారీచెంబులోఁ దూఱుట చూచి అదియు వెంటనే నన్ను వెంబడించి జారీచెం బులోఁ దూఱినది, "ఇది యేమిరా దైవమా! ఇందులో దాఁగుకొన్నను నాప్రాణములు దక్కునట్లు కనుపడ కుండ నున్నవే! సరియా నేఁటితో నాబ్రదుకు?" అను కొనుచు, ఎట్లయినను ఏనుఁగునోటను పడకుండ తప్పించు కొందమని, ఆజారీచెంబులోనే యీమూలనుండి ఆమూ లకు, ఆమూలనుండి యీమూలకును పరుగెత్తుట ప్రారం భించినాను. ఈప్రచారములో, ఎట్లయిన నేమి? ఆఱు మాసములవఱకును ఏనుఁగుతొండమున కందకుండ తప్పిం చుకొనుచు ఉంటిని. తుద కొకనాఁడు ప్రాణము విసిగి నే నాజారీకొమ్మునుండి బయలుదేఱి బయటికివచ్చి పాఱిపోవ మొదలిడినాను. ఆయేనుఁగుకూడ ఊర కుండ లేదు. నావెంటనే జారీకొమ్మునుండి బయటికి వచ్చినది. ఆసమయమున జారీకొమ్మునుండి దానిశరీర మంతయు బయటికి వచ్చినది గాని, తోఁక తాలూకుది ఒక్కవెండ్రుక మాత్రము దానిలోఁ జిక్కుకొన్నది. సరి; ఇం కేమున్నది? ఏనుఁగురావుగారు ఖైదయిపోయి నారు! అది ఆవెండ్రుక నందునుండి తప్పించుకొని బయ టికి వచ్చుట కష్టమయిపోయినది. ఈలోఁగా నేను జాలదూరము పాఱిపోయినాను. ఎట్లయిన నేమి లెండు, అప్పటికి నాభయము తొలఁగిపోయినది. అటువంటి ఆప దనుండి తప్పించుకొని కొంతదూరము వెళ్లునప్పటికి ఎదు టను గంగానది అడ్డముగా ఉన్నది. అందలి నీరు చాల లోఁతుగా ఉన్నట్టు కనుపట్టినది. ఇంటికిఁ జేరుకొనుటకు మార్గాంతరము లేనేలేదు. అప్పుడు నామనస్సు చాల వ్యాకులపడినది. ఎంతసేపు ఒడ్డున నిలువఁబడి ఆలోచిం చినప్పటికిని నా కేమియు ఉపాయము తోఁచినదేకాదు. తుదకు సాహసించి గంగానదిలో దిగఁబడినాను. చేతుల తో నది దాఁటి, యెట్టులయిన నేమి? యజమానుని యిం టికిఁ జేరుకొన్నాను. అక్కడ నే నాఱునెలల వఱకును ఆఁకలి దప్పులబాధ సహించి, ఏనుఁగుతొండములలావున నెత్తిమీఁదను పడుచున్న వర్షధారా పరంపరను సహించి నాయజమానునికి వందనములు చేసినాను. అటు తరు వాతను, ఆయనయొద్దను క్షమాప్రార్థన చేసి వారిసెలవు పొంది బయలుదేఱి యీ ఉజ్జయనీ నగరము సమీపమున మీ అందఱితోను కలిసికొన్నాను. నేను జెప్పిన యీకథ

నిజమే అయినచో ఏదయినను ఉదాహరణముగాఁ జూపి అందఱను నమ్మించుము. అసత్యమే అయినచో, అనఁగా, నేను చెప్పినకథ అంగీకరించుటకు నీకిష్టము లేనిపక్షమున ఈ ధూర్తస్వాము లందఱకును భోజన సదుపాయము చేయింపుము."

కండరీకుఁడు—అయ్యా! తమ రిప్పుడు చెప్పిన కథలో నా కెంతమాత్రమును సందేహము లేదు. భారత-రామాయణాది గ్రంథములు చదివినవా రెవ్వరును, తమరు చెప్పిన వచనములను అసత్యము లని అన నేచాల రని నే ననుకొను చున్నాను.

మూలదేవుఁడు—మంచిది; అటులేని జారీ చెంబులో ఏనుఁగు ఏలాగున ఇమిడినదో, మఱియు, అందులో అది ఆఱునెలలదాఁక నెట్లు తిరుగుచు ఉన్నదో, ఆజారీ కొమ్మునుండి నేను, ఆయేనుఁగు ఏలాగున బయటికి రాఁ గలిగితిమో, ఏనుఁగు మేనంతయు బయటికి వచ్చి దాని తోఁకవెంట్రుక ఒక్కటిమాత్రమే యెట్లు చిక్కుపడి పోయినదో, నేను గంగానదీ ప్రవాహమును జేతులతో ఎట్లు దాఁటఁ గలిగితినో, ఆఱునెలలవఱకును నే నాఁకలి దప్పులబాధను, ఆవర్షము తొలూకు బాధను ఎట్లు సహింపఁగలిగితినో పైనుదాహరించిన గ్రంథములనుండి తగినప్రమాణము చూపింపుము.

కండ—మనము వినుచున్న భారతరామాయణాది గ్రంథములు నిజమయినపక్షమునఁ దమ రిప్పుడు చెప్పిన కథయు సత్యమే కావచ్చును. ఏమందురా? తమ విషయమున జరిగిన కథవంటికథలు పై గ్రంథములలో ఎన్నో ఉన్నవి. వినుండి—పైగ్రంథము లొకదానిలో ఇట్లున్నది:—బ్రహ్మదేవుని ముఖమునుండి బ్రాహ్మణులు బయటికి వచ్చినారు. భుజములనుండి రాజులు బయటికి వచ్చినారు. తొడలనుండి వైశ్యులు బయటికివచ్చినారు. పాదములనుండి శూద్రులు బయటికి వచ్చినారు. జగదుత్పత్తికి ముందు లెక్కకు మిక్కిలిగా నాలుగువర్ణముల మనుష్యులును బ్రహ్మదేవుని శరీరములో ఇముడఁగా, తమజారీచెంబులో తమరు ఏనుఁగు మాత్రమే యిముడుటలో ఆశ్చర్య మేమున్నది? ఇంకొకటి చిత్తగింపుఁడు.

ఒకప్పుడు బ్రహ్మదేవుఁడు "నేను గొప్పవాఁడ" ననియు, విష్ణుమూర్తి "నేను గొప్పవాఁడ" ననియుజగడమాడుటకు ప్రారంభించినారు. తుదకు వారిద్దఱకునుతగవు తీఱక తిన్నఁగా శివునియొద్దకువెళ్లి చెప్పుకొన్నారు. శివుఁడప్పు డాయిద్దఱివాదములను విని "మీయిద్దఱిలో ఎవరు నాలింగముతొలూ కంతమును చూచి వచ్చెదరో అతఁడే గొప్పవాఁడు" అన్నాఁడు. ఆమాట వినఁగానే బ్రహ్మ మీఁదుభాగమునకు బయలుదేఱి దేవమానమున వేయుసంవత్సరములు నడచినాఁడు. కాని శివలింగముతొలూకు కొసకనుపడినదిగాదు. విష్ణుమూర్తి క్రిందుభాగమున పాతాళలోకమువైపు బయలుదేఱి వేయుసంవత్సరముల వఱకును నడిచినాఁడు కాని, అతనికిని కృతకృత్యత కలుఁగకుండనే మరలవలసివచ్చినది. ఇఁకఁ జెప్పవయ్యా! అటువంటిలింగముగనున్న శివుఁడు పార్వతియర్ధశరీరములో నిమిడినపుడు తమ జారీచెంబులో ఏనుఁగిముడుటలో ఆశ్చర్య మేమున్నది? పంచమవేదమయిన భారతములో శ్రీవ్యాసభట్టారకుఁడు "వెదురుకణుపులలోనుండి కీచకుఁడు మొదలగు నూఱుగురన్నదమ్ములు పుట్టినారు;" అనివ్రాసియున్నాఁడు. ఆకథ యిట్లున్నది:— విరాటరాజుగారి పట్టపుదేవికి బిడ్డలు పుట్టలేదు. అందులకై అతఁ డొకఋషిఆశ్రమములోనికి వెళ్లి ఆయనను ఆరాధించినాఁడు. ఆఋషి ప్రసన్నుఁడై ఒకలాడువు మంత్రించి రాణికిమ్మని యిచ్చుచు—"ఇది యేదేని అడవిలో పొదలో కూర్చుండి భక్షింపవలెను. అట్లుచేసిన పక్షమున మీకునూఱుగురుబిడ్డలు పుట్టుదురు" అని చెప్పినాఁడు. రాజుపెండ్లాము ఋషిచెప్పిన చొప్పుననే అడవికిపోయి, ఒకవెదురుపొదలో కూర్చుండిఆయన యిచ్చిన లాడువు తిని యింటికిచేరుకొన్నది. ఆసమయమున, అవెదురుపొదలోనే గాంగిలుఁడనుఋషికూర్చుండి చాలకాలమునుండి తపస్సుచేయుచున్నాఁడు. అక్కడకు సమీపముననే ఒకనది ప్రవహించుచున్నది. ఒకానొక-అచ్చరవచ్చి దిగంబరయై నదిలో స్నానముచేసి ఒడ్డున నిలువఁబడినది. ఋషిదృష్టి అలౌకికరూపవంతురాలయిన దానిమీఁదను ప్రసరించినది. అందువలన ఆయనచిత్తములో గామవికారముగలిగినది. హృదయము చలించినకారణమున క్రిందఁబడియున్న సచ్ఛిద్రమయిన వెదురుబొంగున నూఱుపిండము లేర్పడినవి. అటుతరువాత నాఋషితనమనస్సును, సంబాళించుకొని తనదారిని తాను పోయినాఁడు. నూఱుపిండములుగల వెదురక్కడనే పడియున్నది. తరువాత నెట్లో యీసంగతి విరాటరాజునకుఁ దెలిసినది. వెంటనే

రా జావెదుఱును దనమందిరమునకుఁ దెప్పించినాఁడు. అందుండి సర్వాంగోపాంగ సహితులయి నూఱుగురు బిడ్డలు పుట్టినారు. వారిలో పెద్దవాని పేరు కీచకుఁడు. (కీచక మనఁగా బొంగువెదుఱు. అందుండి పుట్టినందున వానికా పేరు పెట్టినారు.) తక్కినతొంబదితొమ్మండ్రపేరులు ఉపకీచకులు. పెద్దవాఁడు తొమ్మిదివేల గజముల మానిసి యఁట; విరాటరాజుగారి భార్య యీనూఱుగురు బిడ్డలను తనవారినిగాఁ బెంచి పోషించుచు వచ్చినది. ఒకవెదుఱులో ప్రసవసమయమువఱకు నూఱుగురుబిడ్డ లున్నప్పుడు ఒక జారీచెంబులో ఒక్క తమరు, ఏనుఁగుమాత్రమే యిమిడి యుండుటలో ఆశ్చర్యమేమున్నది? ఇదిగాక, శివభగవానుఁడు తన జటాజూటములో వేయిసంవత్సరముల వఱకు గంగానదిని ఉంచుకొన్నట్టు పురాణములలో ప్రసిద్ధమయి ఉండనేఉన్నది కూడను. ఇట్లుండగా తమరు, ఏనుఁగు జారీచెంబులో ఆఱుమాసములవఱకును తిరుగుచు ఉండుటలో ఆశ్చర్య మేమున్నది? మఱియు; శివుఁడు గంగానదిని వేయిసంవత్సరములకాలము తనజటాజూటములోనే త్రిప్పుచు ఉండఁగలిగినప్పుడు తమ రాఱునెలలుమాత్రమే యేనుఁగును జారీచెంబులో వెంటను త్రిప్పుకొనుటలో ఆశ్చర్యమేమున్నది? అసంభవమని యెవరనఁగలరు?

మూల:—మంచిది; నీవు చెప్పిన దంతయు నంగీకరింపవచ్చును గాని జారీకొమ్ములో ఏనుఁగుతోఁక వెంట్రుక యెట్లు చిక్కుకొన్నదో చెప్పుము చూతము.

కండ:—తమకు కలిగినయీసంశయము నివారించుటకై నే నొకపురాణకథ ఉదాహరించెదను—చిత్తగింపుఁడు; మహాప్రళయము తటస్థించినపుడు—అనఁగా, భూమి, తేజస్సు, వాయువు, ఆకాశము, స్థావరములు, జంగమములు మొదలయిన ప్రపంచ మంతయు అభావమును పొంది జలమయ మయినప్పుడు విష్ణుభగవానుఁడు నీటిపైని కూర్చుండి తపస్సు చేయుచున్నాఁడు. ఆసమయమున ఆయననాభికమలమునుండి బ్రహ్మ, కమలము, దండము చేతఁబట్టుకొని బయటికి వచ్చినాఁడు. ప్రయత్నపూర్వకముగా బ్రహ్మ యెట్లో బయటికి రాఁగలిగినాఁడు కాని; ఆతనిచేతనున్న కమలము విష్ణుభగవానుని నాభిలో జిక్కువడిపోయినది. పూజనీయములయిన మన పురాణములలోనే యిట్లున్నపుడు తమజారీచెంబునుండి యేనుఁగు బయటికి వచ్చి, దానితోఁకవెంట్రుక కొమ్ములో చిక్కువడియుండుట అసంభవ మెట్లగును?

మూల:—సరే కాని జారీకొమ్మునుండి నే నెట్లు బయటికి రాఁజాలితిని?

కండ:—ఏమీ? చాల బాగుగనే రావచ్చునే. నే నావిషయమున మహాభారతమునుండి ప్రమాణము చూపించెదను, చిత్తగింపుఁడు: ఒకప్పుడు బ్రహ్మతపస్సు చేయుచున్నాఁడు. వేయిసంవత్సరములు కడచిపోయినవి, దేవతలకుఁ జాల విచారము కలిగినది. "ఎట్లయినను ఇతని తపమునకు విఘ్నము కలిగింపవలయును; లేనిపక్షమున ముందుముందు చాల చిక్కులు తటస్థించును"అని అన్యోన్యము ఆలోచించుచుండఁగా ఇంద్రుఁడు "ఇతనితపోభంగమునకు స్త్రీయే పరమోపయోగమయిన శస్త్రము; గౌతముఁడు, వసిష్ఠుడు, పరాశరుఁడు, జమదగ్ని, కశ్యపుఁడు, అగస్త్యుఁడు మొదలయిన మహర్షులు, హరిహరాదులు, వీరు- వారు అననేల? అందఱును స్త్రీలకు దాసులే- దాసులే అన్నంతమాత్రము చాలదు- దాసానుదాసు లని చెప్పినను చెప్పనేవచ్చును; తప్పులేదు. ఇది అందఱును ఒప్పుకొన్నసంగతియే. స్త్రీ లెట్టివారికైనను తమయిచ్చకు వచ్చినమచ్చున పిచ్చియెత్తించి ఆడింపఁజాలుదురు. మహాదేవునివంటివాఁడయినను తము స్త్రీని చూడఁగానే కాలు జాఱిపడిపోక తప్పదు. ఈసంగతి మీరును ఎఱిఁగినదే. ఒకప్పుడు శివుఁడు యజ్ఞము చేయుచుండఁగా వాయువశమున కట్టుకొన్న బట్ట తొలఁగిన సందర్భములో పార్వతి కనుపడినది. వెంటనే ఆయనచిత్తము కామవికారాయత్త మయిన కారణమున కలశములో నుండి ద్రోణాచార్యుఁడు పుట్టినాఁడు. కాఁబట్టి బ్రహ్మతపస్సు భంగపఱుచుటకును ఎవతెనయినను యువతినే యేర్పాటు చేయుట మంచిది." అని అన్నాఁడు. ఇట్లని స్వర్గలోకములోని వేశ్యలలోఁ దిలోత్తమ అనుదానిని బిలిపించి "ఓసీ! నీవు పోయి బ్రహ్మచేయుచున్నతపస్సు భంగపరచి రమ్ము." అని ఆజ్ఞాపించినాఁడు. తిలోత్తమయు ఇంద్రాదిదేవతల ఆజ్ఞను శిరసావహించి పోకుగా ముస్తాబయి బ్రహ్మయెదుటికిఁ బోయి నృత్య మారంభించినది. ఆసమయమున దానిసర్వాంగములను, నానాప్రకా

రములయిన హావభావవిలాసములను జూడఁగానే బ్రహ్మదేవుని మనస్సు కామవికారగ్రస్త మయిపోయినది. అపుడాయన నిశ్చేష్టితుఁడైపోయి తిలోత్తమవైపే ఱెప్పవాల్చకుండఁ జూడమొదలిడినాఁడు. అపుడు తిలోత్తమ తనప్రయోగించిన శృంగారాస్త్రము లమోఘముగాఁ బని చేయుట చూచి యాతనియెదుటనుండి దక్షిణదిక్కునకుఁ బోయి నృత్యము చేయమొదలిడినది. అపుడు బ్రహ్మ తన మొగ మటువైపు త్రిప్పుట ఉచితమయినపని కాదని ఆలోచించి అటువైపునఁగూడ నొక క్రొత్తమొగము తయారుచేసికొని దాని రూపామృత పానముచేయుటకుఁ బ్రారంభించినాఁడు. అంతలో అది వెనుకకుఁ దిరిగినది. ఆయన అటువైపుకూడ ఒక మొగము తయారు చేసికొన్నాఁడు. ఇంతలో ఆహాంతకారి ఉత్తరమువైపు తిరిగినది. అటువైపునసుఁగూడ మొగము తయారు చేసికొన్నాఁడు. ఓహో! మన మెటువైపు తిరిగిన అటువైపే మొగము తయారు చేసికొనుచున్నాఁడే! అని అది మీఁదుగాఁ బోయి, ఆకసముపైని నాట్యము ప్రారంభించినది. బ్రహ్మయ్యగా రదివఱ కెప్పుడో దానికి దాసుఁ డయిపోయినాఁడు. దానిని జూడకుండ నతఁ డెట్లూరకుండఁ గలఁడు? అప్పుడు తప్పని సరిగా ఆలోచించి మీఁదువైపునకుఁగూడ అయిదవమొగము తయారుచేసికొనవలసిన అవస్థకుఁ బాలుపడినాఁడు. బ్రహ్మ యీప్రకారముగాఁ గామవశంవదుఁడైపోయియుండుట చూచి యీశ్వరుఁడు తనగోళ్లచేతను మీఁదువైపున నున్న అయిదవ మొగము గిల్లివేసినాఁడు. అందుపైని బ్రహ్మకుఁ గోపము కలిగినది. ఆయన కన్ను లెఱ్ఱచేసి శిరసునుండి స్రవించుచున్న చెమ్మట తర్జనిచేఁ దుడిచి భూమిపైని విదలించినాఁడు. ఇఁక నేమున్నది? అందుండి, శ్వేతకుండలి అను పురుషుఁ డొకఁడు బలవంతుఁడు పుట్టి బ్రహ్మదేవుని యొద్దను సెలవంది యీశ్వరుని వెంటను బరుగెత్తినాఁడు. శివుఁడు పాఱిపోయినాఁడు. అట్లు పరుగెత్తి పరుగెత్తి తిన్నఁగా బదరికాశ్రమములోఁ బ్రవేశించి యందు విష్ణునిఁ జూచి "బావా! రక్షింపవా?" అని అతనిని శరణు చొచ్చినాఁడు. అంతట విష్ణుదేవుఁడు తన కపాలమునుండి ఒకరక్తనాడిని తెఱచినాఁడు. దానినుండి రక్తము ప్రవహింప మొదలిడినది. శివుఁడు గోళ్లచే గిల్లి తెచ్చిన బ్రహ్మతౌలా కయిదవముఖము క్రింద నున్నదిగదా! అది ఆరక్తముతో నిండినది. దేవమానముచేతను, వేయి సంవత్సరములకాలము విష్ణుని కపాలమునుండి వచ్చిన నాడినుండి రక్తము ప్రవహించుచునే యుండెను. కాని క్రిందితల పూర్తికాలేదు. అది చూచి శివుఁడు తనవ్రేలిచే దానిని తుడిచినాఁడు. ఆసమయమున బ్రహ్మతల, విష్ణుని రక్తధార, శివుని అంగుళి, ఈ మూఁడింటి సంయోగము వలనను రక్తకుండలి అను పురుషుఁడు పుట్టినాఁడు. వాఁడును శివుని ఆజ్ఞను బొంది శ్వేతకుండలితో యుద్ధమారంభించినాఁడు. దేవమానమున వేయేండ్లు యుద్ధము జరిగినది. అపుడు దేవతలు వచ్చి యుద్ధ మాఁపినారు. ఆయిద్దఱిలోను ఒకనిని దేవేంద్రునకును, రెండవవానిని సూర్యునకును అప్పగించినారు. అప్పగించునపుడు "ఎప్పుడు భారతయుద్ధ మగునో అప్పుడు మీ రీయిద్దఱను యుద్ధము వృద్ధియగుటకై భూలోకమునకుఁ బంపవలయును" అని చెప్పినారు. అనంతరము భారతయుద్ధమునకు ముందు, సూర్యుఁడు కుంతిచే నాహూతుఁడై దాని రూపలావణ్యాదులు చూచి మోహితుఁడై వదలిపోలేక దానిని బెదరించి యెట్లో దాని నంగీకరింపఁజేసి తానువచ్చినపని నెఱవేర్చుకొనివెళ్లిపోయినాఁడు. అదివఱలో సూర్యునిలోఁ బ్రవేశించియున్న రక్తకుండలి అనుయోధుఁడు కుంతిగర్భములోఁ బ్రవేశించినాఁడు. కుంతి తొమ్మిదినెలలు పూర్తి అయినతరువాతను వానిని దనకర్ణము (చెవి) మార్గమున కన్నది. అందుచేతనే ఆబాలుఁడు కర్ణుఁ డయినాఁడు. అంతచిన్నకర్ణద్వారమున కర్ణునియంతటిశూరుఁడు, వీరుఁడు అయినబాలుఁడు రాఁగా, జారీకొమ్మునుండి తమరు బయటికివచ్చుట కభ్యంతర మేముండును?

మూల:— సరే; అన్నింటికిని సమాధానము చెప్పినావు; అంతమహాప్రవాహముతోఁ గూడియున్న గంగానదిని నేను చేతులతో దాఁటి యెట్లు ఒడ్డు చేరఁగలిగితిని?

కండ:— అయ్యా! ఇదికూడ అడుగుచున్నారే? తమరు రామాయణ మెప్పుడును చదివికాని; వినికాని ఉండలేదా? రామాయణములో రామచంద్రుని ఆజ్ఞపైని సీతజాడ తెలిసికొనుటకై ఆంజనేయుఁడు లంకలోనికి వెళ్లినాఁడు. ఆవెళ్లునప్పుడు నూఱామడదూరముగల సముద్రమును తనచేతులతోడనే దాఁటి వెళ్లినాఁడు. సీత ఆతనివలన శ్రీరామునియావద్వృత్తాంతమును విన్నతరు

వాత "నీ వీసముద్రమును ఎట్లు దాఁటి రాఁగలిగి నావు?" అని ప్రశ్నించినది.

శ్లో. తవ ప్రసాదా త్పవనప్రసాదా
ద్భర్తుశ్చ తే దేవి! మహాప్రసాదాత్,
త్రిభిః ప్రసాదై రనుగమ్య తోయం
తీర్ణో మయా గోష్పదవ త్సముద్రః."

అమ్మా! నీయనుగ్రహమువలనను, మాతండ్రియయిన వాయుదేవుని అనుగ్రహమువలనను, దేవీ! నీభర్తయగు రామునిమహాప్రసాదమువలనను, మొత్తముమీఁద మీ ముగ్గురిదయవలనను నే నీసముద్రమును గోష్పదము (గోవుఅడుగు) దాఁటినట్లు దాఁటివచ్చినా నని సమాధానము చెప్పినాఁడు హనుమంతుఁడు. అంతసముద్రమునే అతఁడు గోష్పదము దాఁటినట్లు దాఁటినమాట నిజ మయినప్పుడు తమ రామాత్రపుగంగానదిని దాఁటుటమాత్రము నిజమెందులకుఁ గాఁగూడదు?

మూల:—నే నాలునెలలవఱకును జలధారలను దలమీఁద నెట్లు ధరింపఁగలిగినాను?

కండ:—ఒకప్పుడు దేవతలందఱును కలిసి గంగాదేవి నీ భూలోకమునకు దయచేయు మని ప్రార్థించినారు. "భూలోకమువారి క్షేమమునకై నేను క్రిందికి వచ్చుటకు సిద్ధముగా ఉన్నాను; కాని నే నాకాశమునుండి క్రిందను బడునప్పుడు నన్ను ధరించు వా రెవరో చెప్పండి." అని గంగ అన్నది. "ఆపనికి నేను సిద్ధముగా ఉన్నాను" అని శివుఁ డన్నాఁడు. ఆప్రకారముగానే దానిని దన జడలలో ధరించినాఁడు. ఎన్నాళ్లు? దివ్యవర్ష సహస్రపరిమితకాలము. అంత పెద్దదయిన ఆకాశగంగానదిని శివుఁడు తన తలపైని ధరించినమాట యెఱింగినవారికి తమ నాలుగు మాసములు జలధారలను ధరించినా రన్నమాట ఆశ్చర్యకరమయి యుండదు. కాఁబట్టి తమరు చెప్పినసంగతు లన్నియు సత్యములు; యథార్థములు, అసత్యములు కావు. అణుమాత్రమయినను ఇందులో అబద్ధము అన్నమాట ఉన్న దని యెవ్వరును అన సాహసింపరు. ఏమంటారు?

మొదటికథ సరి.

# గోవు మాలచ్చిమి

నండూరి వెంకటసుబ్బారావు గారు, బి. ఏ.

మనిసికైనాలేని మంచిపోకిళ్లు
గోవుమాలచ్చిమికి కోటిదణ్ణాలు

యెంకితో కూకుండి
యింత సెపుతుంటే
తనతోటిమనవల్లె
తలదిప్పుతాది. గోవు.

యెంకి సరసాలాడ
జంకుతావుంటే
సూసిసూడకకన్ను
మూసితెరిసేది. గోవు.

కూరి కూకుని నేనె
పోరుపెడుతుంటె
తల్లిదుపు పిల్లల్లె
తెల్లపోతాది. గోవు.

మనిసికైనాలేని మంచిపోకిళ్లు
గోవు మాలచ్చిమికి కోటిదణ్ణాలు.